
# 'నాదగ్గరెందుకు నీది?'

కొలపల్లి ఈశ్వర్



అల్లంత దూరాన్నుంచే గమనించాను ...

మదన్‌మోహన్ మూర్తిరాజుకెదురుగా కూర్చుని ఉన్నాడు. అంటే ఒక టేబుల్ కి వాళ్లిద్దరూ అటూ ఇటూ కూర్చుని ఉన్నారన్నమాట!

మదన్ మోహన్ పెదవులు కదులుతూ ఉన్నాయి. అతని చేతిలో ఓ కాయితం ఉంది. అతనికెదురుగా ఉన్న మూర్తిరాజు ముఖం విషం తాగుతున్నవాడి ముఖంలా ఉంది. ఇంకాసేపట్లో చావబోతున్నవాడి ముఖంలా ఉంది. ప్రపంచంలోని దరిద్రమంతా నెత్తికెక్కినవాడి ముఖంలా ఉంది.

దాంతో నాకు ఆటోమేటిగ్గా సీనర్థమైపోయింది.

'పాపం!' అనుకున్నాను మనసులో, మూర్తిరాజు నుద్దేశించి. ఆ బాధని భరించడంకన్నా ఎద్దుతో పొడిపించుకోవడం బావుంటుంది. సలసలా కాగుతున్న నూనెలో చెయ్యి ముంచడం బావుంటుంది.

అనుభవించి ఉన్నవాణ్ణే కాబట్టి నాకు తెలుసు ఆ బాధ ఎలాంటిదో!

ఇప్పుడు గనుక నేనా మదన్‌మోహన్ కళ్లబడితే, ఆ మూర్తిరాజుతో పాటు నేను కూడా బలైపోవాల్సిందే!

ఆ ఊహకే నా గుండెలో రైళ్లు పరుగులుతీశాయి. అందుకే 'ఎర్రనీళ్లు' గొంతులో పోసుకోవాలన్న ఆలోచనకి స్వస్తి చెప్పి చటుక్కున వెనుదిరిగాను.

మా ఆఫీస్ కాంటీన్‌లో లభ్యమయ్యే కాఫీ అనబడే విచిత్ర ద్రవపదార్థాన్ని మేం ఎర్రనీళ్లనే అంటూంటాం.

సీనిప్పుడు మీ కర్థమైపోయిందిగా?

నేను మా ఆఫీస్ కాంటీన్‌లోకి ఎంటరవ్వబోయి మానేసి వెనుతిరిగానన్నమాట!

"శంకర్రావ్! శంకర్రావ్...!" నేనిలా వెనుదిరిగానో లేదో అలా నా చెవుల్లో దూరిపోయింది మదన్‌మోహన్ పిలుపు!

అంటే నన్నతను చూసేశాడన్నమాట.

'చచ్చాన్రా దేవుడా!' అనుకున్నాను మనసులో.

అతనెలాగూ నన్ను చూసేశాడు కాబట్టి నేను వినిపించుకోనట్టే వెళ్లిపోయినా ప్రయోజనముండదు. పరుగెత్తుకుంటూ వచ్చి నా కాలర్ పుచ్చుకునైనా లాక్కెళ్లిపోతాడు. పశువునీడ్చుకుపోయినట్టు ఈడ్చుకుపోతాడు.

అలా ఈడ్పించుకోవడం కన్నా నా అంతట నేనే వెళ్లడం మంచిదనిపించి, ఆ పనే చేశాను.

వెళ్లి మూర్తిరాజు పక్కనే కూర్చున్నాను.

"ఏమిటీ, లోపలికి రాబోయి మళ్లీ వెళ్లిపోతున్నావ్?" నేను కూర్చున్న వెంటనే నాకేసి నవ్వుతూ చూస్తూ అడిగాడు మదన్‌మోహన్.

ఆ నవ్వుని చూస్తుంటే కంపరమెత్తిపోయింది నాకు. ముళ్లకంప మీదపడుతున్నట్టుగా అనిపించింది. సహారా ఎడారిలో మిట్టమధ్యాహ్నంపూట ఇసుకలో తల దూర్చినట్టుగా అనిపించింది.

కానీ స్వతహాగా నాది మెతక స్వభావం. చూస్తూ చూస్తూ ఏ మనిషినీ హర్ట్ చెయ్యలేను.

> 'పాపం!' అనుకున్నాను మనసులో, మూర్తిరాజు నుద్దేశించి. ఆ బాధని భరించడంకన్నా ఎద్దుతో పొడిపించుకోవడం బావుంటుంది. సలసలా కాగుతున్న నూనెలో చెయ్యి ముంచడం బావుంటుంది.
> అనుభవించి ఉన్నవాణ్ణే కాబట్టి నాకు తెలుసు ఆ బాధ ఎలాంటిదో!



అందుకే ముఖంలో ఏమాత్రం చిరాకుని కనబరచకుండా "అబ్బే, ఏం లేదు మదన్! కాఫీ తాగుదాం అనుకున్నాను కానీ ఆ ఎర్రనీళ్లని తల్చుకోగానే కడుపులో తిప్పినట్టనిపించి ఆ ఉద్దేశం మార్చుకుని వెళ్లిపోబోయాను. మీ ఇద్దర్నీ నేను చూణ్ణేలేదు అసలు!" అంటూ అబద్ధం ఆడేశాను.

"కాస్త ముందుగా వచ్చుండాల్సింది. నువ్వూ వినుండేవాడివి. ఇప్పుడే మన మూర్తిరాజుకో జడను వినిపించాను!" అన్నాడు మదన్‌మోహన్.

అయితే ఇప్పుడు మళ్లీ వినిపించబోవట్లేదన్నమాట! 'థాంక్‌గాడ్...!' మనసులో అలా దేవుడికి కృతజ్ఞతలు తెలుపుకున్నాక, "నేను మొన్నే ఓ యాభైదాకా విన్నాగా! మళ్లీ ఎప్పుడైనా వింటాన్లే. టైమైంది, నడవండి నడవండి! ఆ మేనేజర్ వచ్చేసరికి మనం సీట్లలో లేకపోతే, తెలుసుగా ఏమవుతుందో?!" అంటూనే లేచి నిలబడ్డాను.

ఆ అవకాశాన్ని మిస్ చేసుకోకూండా "అవునవును...!" అంటూ మూర్తిరాజు కూడా రక్కున లేచి నిలబడ్డాడు.

దాంతో ఇక తప్పనిసరై మదన్‌మోహన్ కూడా లేచి నిలబడ్డాడు.

ముగ్గురం ఆఫీసులోకెళ్లి మామా సీట్లలో కూర్చున్నాక ...

"అన్నట్టు మొన్న నాది ఒకటి మీ ఇంట్లో ఉండిపోయింది!" అన్నాడు మదన్‌మోహన్. నా ఎదురుగా ఉండే సీటే అతనిది.

"ఏది?" అనడగబోయి, విషయం స్ఫురించడంతో "అవునుండిపోయింది. రేపొచ్చినప్పుడు తీసుకువచ్చి ఇస్తాలే!" అన్నాను నేను.

"ఫర్వాలేదులే, ఉండనీ!" అన్నాడు మదన్‌మోహన్. ఎంతో ఉదార స్వభావుడిలా చూస్తూ.


"అంటే నన్నుంచేసుకోమనా?" అన్నాను.

"ఉంచేసుకున్నా నేనేం బాధపడను. ఉండనీలే, తర్వాత చూసుకుందాం!" అన్నాడు మదన్‌మోహన్ ఎటూ తేల్చి చెప్పకుండా.

అతనుంచేసుకోమన్నా, నిజంగా ఉంచేసుకునే ఉద్దేశ్యం నాలో ఏకోశానా లేదు.

"నాకెందుకు నీది? రేపు తెచ్చిచ్చేస్తా! అసలివ్వాళ తెచ్చుండేవాణ్ణి. తీసుకువద్దామని అనుకుంటూనే బయలుదేరేముందు ఆ హడావుడిలో మర్చిపోయాను ..." అన్నాను సంజాయిషీ ఇస్తున్న ధోరణిలో.

"ఫర్వాలేదంటున్నాగా, ఉండనీ ..." తేలిగ్గా



నాలుక చప్పరించేస్తూ అన్నాడు మదన్‌మోహన్.

నాకు దాని ఆకారం గుర్తుకొచ్చింది.

ఎక్కడికక్కడ రంధ్రాలు పడిపోయి, ఒకటో రెండో చువ్వలూడిపోయి శిథిలావస్థలో ఉంది అది. అది నాకెందుకూ?

అందుకే "నా దగ్గరెందుకు నీది? రేపు తెచ్చిచ్చేస్తాలే!" అన్నాను మళ్లీ.

మదన్‌మోహన్ ఏదో అనబోయాడు. కానీ ఈలోగా మా మేనేజర్ రావడంతో ఎక్కడివాళ్లం అక్కడ సైలెంట్ అయిపోయాం."

000

సమయం రాత్రి 7.30 గంటలు.

నేను హాల్లో మా అబ్బాయితో కారెమ్స్ ఆడుతూ కూర్చున్నాను.

అంతలో "శంకర్రావ్... శంకర్రావ్...!" అంటూ మదన్‌మోహన్ పిలుపు వినిపించింది బయటనుంచి.

'హే భగవాన్!' అనుకున్నాను మనసులో.

అయినప్పటికీ ఇంటికొచ్చిన మనిషిని లోనికాహ్వానించకుండా ఉండలేం కదా! అందుకే లేచి వెళ్లి డోర్ ఓపెన్ చేసి "రా, మదన్, రా!" అన్నాను ముఖాన చిరునవ్వులాంటిది పులుముకుంటూ.

"నాది నీ దగ్గరుండిపోయిందని పొద్దున్న తెగ బాధపడిపోయావ్‌గా! అందుకే దాన్ని తీసుకుపోదామని వచ్చాను!" అంటూ లోనికొచ్చి సోఫాలో కూర్చున్నాడు.

'అందుకే అయితే ఫర్వాలేదు' అనుకున్నాను నేను మనసులో.

కానీ వెంటనే వెళ్లి తెచ్చి చేతిలో పెట్టడం బావుండదుగా?

అందుకే "ఏమిటి విశేషాలు?" అంటూ అతనికి ఒకింత ఎడంగా అదే సోఫాలో కూర్చున్నాను.

అతను చుట్టుకున్న మఫ్లర్‌ని విప్పి టీపాయ్‌మీద పడేసి, "ఏముందీ? నిన్నా మొన్నా ఇంకో యాభై దాకా రాశాను. నాది నేను తీసుకున్నట్టూ ఉంటుంది, వాటిని వినిపించినట్టూ ఉంటుంది కదాని నేనే ఇలా వచ్చాను. అంతేగానీ రేపొద్దున్న నువ్వు తెచ్చివ్వవని కాదు!" అంటూ లాల్చీ జేబులోంచి ఒక కాగితాల కట్టని బయటకు తీశాడు.

ఆ కాగితాల కట్టకేసి చూస్తుంటే నాకు భోరున ఏడవాలనిపించింది. జుత్తు పీక్కోవాలనిపించింది. బట్టలు చింపుకోవాలనిపించింది.

కానీ ఒక్కటీ చెయ్యలేకపోయాను.

అలా చేస్తే అతను హర్టవుతాడు కదా! అందుకే "సరే, కానీయ్!" అన్నాను నన్ను నేను ఓ బలిపశువుగా మార్చేసుకుంటూ.

"ఆకాశంలో
కాకి రెట్ట
చంద్రుడు!" అన్నాడు మదన్‌మోహన్.

"బాగుంది!" అన్నాను నేను నిలువుగా తలాడిస్తూ.

"సరోవరంలో
గుర్రపులద్దె
తామర పువ్వు!" అన్నాడు మదన్‌మోహన్.

"బాగుంది!" అంటూ మళ్లీ నిలువుగా తలాడించాను నేను.

"పేదవాడి గుండెమీద
ఏనుగు పాదం
ఆడపిల్ల!" అన్నాడు మదన్‌మోహన్.

"బాగుంది"కి ముందు ఈసారి "చాలా" అనే రెండక్షరాల్ని ఏడ్ చేశాను సంతోషిస్తాడు కదాని.

నిజంగానే చాలా సంతోషించాడు.

"ఏనుగుమీద
వాలిన దోమ
రాజకీయ నాయకుడి అవినీతి!" అన్నాడు మదన్‌మోహన్.

'చాలా'ని తీసెయ్యడం దేనికిలెమ్మని ఈసారి కూడా "చాలా బావుంది!" అంటూ నిలువుగా తలాడించాన్నేను.

అతను వినిపిస్తున్నవి 'హైకూ'లని అతని ఉద్దేశం. కాదు... నమ్మకం.

"సెప్టిక్ లెట్రిన్‌లో
చీపురు కట్ట
... ..." అంటూ అతనింకేదో వినిపిస్తుంటే చచ్చిపోవాలనిపించింది నాకు.

అయినా ఎలాగో నిగ్రహించుకున్నాను.

అలా ఓ యాభై పిచ్చి పిచ్చి 'హైకూ'లు వినిపించాక, "చాలా థాంక్స్, శంకర్రావ్! నాది నాకిచ్చేస్తే నేనింక వెళ్లొస్తాను, చాలా పొద్దుపోయింది!" అంటూ లేచి నిలబడ్డాడు మదన్‌మోహన్.

నేను లోపలకెళ్లి అతను మొన్న మా ఇంట్లో మర్చిపోయి వెళ్లిన డొక్కు గొడుగుని తీసుకువచ్చి అతని చేతికందించాను.

"చాలా థాంక్స్, శంకర్రావ్! చాలా ఓపిగ్గా విన్నావు!" అని మరోసారి చెప్పి అతను వెళ్లిపోయాక "ఏమండీ, ఇంక వడ్డించమంటారా, శనిగాడు వెళ్లిపోయినట్టున్నాడుగా?" అంటూ నా భార్య హాల్లోకి వచ్చింది.

"ఊఁ, వడ్డించు!" అన్నాను నేను నీరసంగా.

అప్పుడు పడింది నా దృష్టి టీపాయ్‌మీద అతనొదిలేసిపోయిన మఫ్లర్‌మీద.

'ఓరి నీ మతిమరుపు తగలెయ్యా!' అనుకున్నాను మనసులో.

దాన్ని చూస్తుంటే నాకు జెర్రిని చూసినట్టుగా అనిపించింది. పాముని చూసినట్టుగా అనిపించింది.

000

మర్నాడు ఆఫీసులో ...

"నిన్న నువ్వు మా ఇంట్లో దీన్ని మర్చిపోయావ్, మదన్! నా దగ్గరెందుకు నీది? అందుకే తీసుకువచ్చాను!" అంటూ నా బాగ్‌లోంచి మఫ్లర్‌ని బయటకు తీసి దాన్ని అతని చేతికందిస్తూంటే అతని ముఖం వాడిపోయింది.

వాడిపోయిన ఆ ముఖాన్ని చూస్తూంటే.. అప్పుడర్థమైంది నాకు అతను దాన్ని మర్చిపోలేదనీ, కావాలనే వదిలేసి వెళ్లాడనీ.

'ఓరి అసాధ్యుడా!' అనుకున్నాను మనసులో. ■

